బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ బుధవారం 07 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4

## స్విమ్మింగ్‌లో తెలంగాణకు మూడు స్వర్ణాలు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ స్విమ్మర్లు సత్తా చాటారు. బిహార్ వేదికగా జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రానికి చెందిన స్విమ్మర్లు మూడు స్వర్ణ పతకాలు సాధించారు. మహిళల100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో తెలంగాణ క్రీడాకారిణి నిత్య సాగి ప్రథమ స్థానంలో నిలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో సుహాస్ ప్రీతమ్ స్వర్ణం దక్కించుకున్నాడు. సుహాస్ 1:06.36 సెకన్లలో లక్ష్యాన్ని చేరి పసిడి పతకం గెలుచుకున్నాడు. పురుషుల 400 మీటర్ల వ్యక్తిగత మెడ్‌లే విభాగంలో తెలంగాణ స్విమ్మర్ వర్షిత్ ధూలిపూడి పసిడి పతకం సాధించాడు. విజేతలను తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఉమేశ్ అభినందించారు.

## ఆర్ఆర్ఆర్ , రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణం, జంక్షన్ల మధ్య

# అనుసంధానత ఉండాలి

- ముందుగానే లైడర్ సర్వే చేపట్టాలి
- రేడియల్ రోడ్ల నిర్మాణం ప్రక్రియ వేగవంతం చేయాలి
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- ఆర్ఆర్ఆర్ సౌత్ అలైన్‌మెంట్‌పై సమీక్ష



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు తగినట్లుగా రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఇతర రహదారుల నిర్మాణం, జంక్షన్లు, వాటి మధ్య అనుసంధానత ఉండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్ఆర్ఆర్ (దక్షిణ భాగం)కు సంబంధించిన అలైన్‌మెంట్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి పలు మార్పులు సూచించారు. రీజనల్ రింగ్ రోడ్డు , రేడియల్ రోడ్ల నిర్మాణంతో పాటు ఇతర అంశాలపై రోడ్లు, భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి , సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , సంబంధిత శాఖ అధికారులతో జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి సమీక్షించారు.

ఆర్ఆర్ఆర్ (సౌత్)కు సంబంధించిన అలైన్‌మెంట్‌కు సంబంధించి అటవీ ప్రాంతం, జల వనరులు, మండల కేంద్రాలు, గ్రామాల విషయంలో ముందుగానే లైడర్ సర్వే చేపట్టాలని ఆదేశించారు. అలైన్‌మెంట్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వరాదని స్పష్టం చేశారు. శాటిలైట్ టౌన్‌షిప్‌లు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు అనుగుణంగా రేడియల్ రోడ్లకు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ వరకు అనుసంధానం చేసే రేడియల్ రోడ్ల నిర్మాణం ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు.

హైదరాబాద్ నుంచి వెళ్లే జాతీయ, రాష్ట్ర రహదారులు ఆర్ఆర్ఆర్ వెలుపలికి వెళ్లే ప్రాంతంలో తగు రీతిలో ట్రంపెట్స్ నిర్మించాలని, ఎటువంటి గందరగోళానికి తావులేకుండా, ట్రాఫిక్ సిగ్నల్స్ లేకుండా దాటేలా చూడాలని సీఎం గారు అధికారులకు తెలిపారు. హైదరాబాద్ - శ్రీశైలం జాతీయ రహదారిలో ఎలివేటెడ్ కారిడార్, నూతన అలైన్‌మెంట్‌కు సంబంధించి ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ నుంచి మంచిర్యాల వరకు నూతన రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆ మార్గంలో పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను పరిశీలించాలన్నారు. ఈ నూతన రహదారులకు సంబంధించి జాతీయ రహదారుల శాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు.



## ఆర్టీసీ సమ్మె వాయిదా

- ఆర్టీసీ సంస్థ పరిరక్షణ కార్మికుల సంక్షేమం ప్రయాణికుల సౌకర్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుంది
- మంత్రి పొన్నం ప్రభాకర్
- జేఏసీ నేతలతో మంత్రి భేటీ
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- చర్చలు సఫలం : జేఏసీ ప్రతినిధులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఈనెల 7 నుంచి తలపెట్టిన సమ్మె పలు నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. సమ్మె విరమణ కోసం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మూడు రోజులుగా కార్మిక సంఘాల నాయకులతో వేర్వేరుగా చర్చలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే టీఎమ్‌యూ ప్రధాన కార్యదర్శి ఇ అశ్వత్థామరెడ్డి నేతృత్వంలోని జేఏసీతో సోమవారం మంత్రి చర్చలు జరిపారు. అనంతరం తమ జేఏసీలోని కార్మికులు సమ్మెలో పాల్గొనబోరని అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. మంగళవారం ఉదయం టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రితో భేటీ తర్వాత సమ్మెపై తమ వైఖరిని తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. అనంతరం సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని మరో జేఏసీ ప్రతినిధులు ఈదురు వెంకన్న, ఎమ్ థామస్‌రెడ్డి, కే హన్మంతు ముదిరాజ్‌లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశ మయ్యారు. దాదాపు మూడు గంటలపాటు పలు అంశాలపై చర్చించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదనీ, ఇప్పటికే పలు డిమాండ్లను పరిష్కరించామంటూ మంత్రి జేఏసీ ప్రతినిధులకు వివరించారు. చర్చలు శాంతియుత వాతావరణంలో సామరస్యంగా జరిగాయనీ, తమ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినందుకు సమ్మెను వాయిదా వేస్తున్నామని అనంతరం జేఏసీ ప్రతినిధులు సచివాలయం వద్ద మీడియాకు తెలిపారు. డిపోల్లో సమస్యలు, ఉద్యోగులు, కార్మికులపై పనిభారం, ఒత్తిళ్లు, కొత్త రిక్రూట్‌మెంట్లు, ఉద్యోగ భద్రత, సింగరేణి తరహా కారుణ్యనియామకాలు, వేతన సవరణ, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లింపు, విద్యుత్ బస్సుల్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలనే పలు అంశాలను మంత్రి వద్ద ప్రస్తావించామని నేతలు తెలిపారు. సమ్మె వాయిదా తాత్కాలికమేననీ, ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే, మరోసారి సమ్మె తేదీ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమ్మె వాయిదా వేస్తున్నట్టు జేఏసీ నేతల ప్రకటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ పక్షపాతిగా ఉంటుందని తెలిపారు.

## ప్రభుత్వ ఆసుపత్రులకు బ్రాండింగ్



- మంత్రి దామోదర్ రాజనర్సింహ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం, విశ్వాసం పెరిగేలా మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యం తో ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్ష లో ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్ పై శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా పవర్ పాయింట్ ద్వారా చేపట్టే అంశాలను వివరించారు. రాష్ట్రం లో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవల బలోపేతానికి నిర్దిష్టమైన విధానాలను రూపొందించి అమలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చోంగ్తూ, TGMSIDC MD ఫణీంద్ర రెడ్డి, DME డా. నరేంద్ర కుమార్, టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ డీఎంఈ డా. విమల థామస్, Tgmsidc CE దేవేందర్ లు పాల్గొన్నారు.



### విమానాశ్రయాన్ని
## అందంగా ముస్తాబు చేయాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం పలకాలని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించి, స్వాగత సత్కారాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.

మిస్ వరల్డ్ వేడుకలకు వచ్చే సుందరీమణులు, ప్రతినిధులు, ఇతర అతిథులకు స్వాగత ఏర్పాట్లను మంత్రి జూపల్లి స్వయంగా పర్యవేక్షించారు. జీఎంఆర్ ప్యాసెంజర్ ఎక్స్పీరియన్స్ , పర్యాటక శాఖ, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, సీఐఎస్ఎఫ్ అధికారులతో సమీక్షించారు. విమానాశ్రయాన్ని మరింత అందంగా ముస్తాబు చేయాలని, పూలు, మామిడి, అరటి తోరణాలతో సుందరంగా అలంకరించాలని సూచించారు. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ క్లియరెన్స్ ను త్వరగా పూర్తి చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వాగత బృందాల సంఖ్యను పెంచాలని చెప్పారు. అడుగడుగునా తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని తెలిపారు. అదే సమయంలో ఎయిర్పోర్ట్ కు విచ్చేసిన మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో మార్లే లీల్ సర్వాంతేస్ తో భేటీ అయ్యారు. తెలంగాణలోని వారసత్వ, చారిత్రక కట్టడాలను సందర్శించాలని వారిని కోరారు. ఈ సందర్భంగా అల్ ది బెస్ట్ చెప్పారు.

## గాలి జనార్ధన్‌రెడ్డికి ఏడేండ్ల జైలు శిక్ష

- ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తీర్పు15 ఏండ్ల సుదీర్ఘ విచారణ..
- ఐదుగురు దోషులుగా నిర్ధారణ
- చంచల్‌గూడ జైలుకు తరలింపు
- నిర్దోషులుగా నాటి గనుల శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందం




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఏపీ అనంతపురం జిల్లా ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సీబీఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా ఐదుగురిని దోషులుగా తేల్చింది. ఏ2 గాలి జనార్దన్‌రెడ్డిని దోషిగా తేల్చిన సీబీఐ కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష విధించింది. దోషులు అందరికీ ఏడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తున్నట్లు పేర్కొంది. ఏ3 వీడీ రాజగోపాల్‌ను, ఏ4 ఓఎంసీ కంపెనీని, ఏ7 మెఫజ్ అలీఖాన్‌ను సీబీఐ కోర్టు దోషిగా తేల్చింది. వీడీ రాజగోపాల్‌కు అవినీతి నిరోధక చట్టం కింద నాలుగేళ్ల జైలుశిక్ష ఖరారు చేసింది. ఏ4 ఓఎంసీ కంపెనీని దోషిగా తేల్చిన సీబీఐ కోర్టు, రూ.లక్ష, రూ.లక్ష చొప్పున రూ.2 లక్షల జరిమానా విధించింది. గాలి జనార్దన్‌రెడ్డి సహా నలుగురిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇక సబితా ఇంద్రారెడ్డిని నిర్దోషిగా తేల్చింది. 2004-2009 మధ్య గనులశాఖ మంత్రిగా సబిత పని చేశారు. సబితతో పాటు విశ్రాంత ఐఏఎస్ కృపానందంను నిర్దోషిగా తేలుస్తూ సీబీఐ కోర్టు తీర్పు ఇచ్చింది. ఓఎంసీ కేసు విచారణ దశలోనే ఏ5 లింగారెడ్డి మృతి చెందారు. 2022లో ఏ6 శ్రీలక్ష్మిని తెలంగాణ హైకోర్టు కేసు నుంచి డిశ్చార్జి చేసింది.

ఈ కేసులో వీడీ రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేండ్లు జైలు శిక్ష విధించింది. భూగర్భగనుల శాఖ డైరెక్టర్ గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వాధికారిగా ఉంటూ అక్ర మాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏండ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది.2007 జూన్18న ఓఎంసీకి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఉద్దేశపూర్వకంగానే 'క్యాప్టివ్' అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సీబీఐ కేసు నమోదు చేసింది.

ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏండ్ల పాటు విచారణ కొనసాగింది. కేసు దర్యాప్తునకే ఐదేండ్లు సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు చార్జిషీట్‌లను దాఖలు చేసింది. ఓఎంసీ వ్యవహారంలో 2011లో చార్జిషీట్‌ను తొలిసారి వేయగా.. 2014లో తుది చార్జిషీట్ తర్వాత సుదీర్ఘంగా విచారణ జరిగింది. 219 మంది సాక్షులను విచారించింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా పలు సాక్ష్యాలు, ఆధారాలను సీబీఐ సేకరించింది. ఈ కేసు విచారణలో మొత్తంగా 3337 డాక్యుమెంట్లను పరిశీలించారు. ప్రభుత్వం కేటాయించిన 68 హెక్టార్లలో కాకుండా పెద్ద ఎత్తున మైనింగ్ చేపట్టినట్లు సీబీఐ గుర్తించింది.

### బీఆర్ఎస్ చేసిన అప్పు
## 4 లక్షల 17 వేల కోట్లు మాత్రమే



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు కేవలం రూ. 4 లక్షల 17 వేల కోట్లు మాత్రమే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. అందాల పోటీలకు 250 కోట్లు ఉన్నాయి కానీ పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు పెన్షన్లకు బెనిఫిట్స్‌కు పైసల్లేవా..? ఇదేనా నీ ప్రాధాన్యత. నన్ను కోసుకొని వండుకుని తింటారా.. ఇది ప్రభుత్వ ఉద్యోగులను ఉద్దేశించి సీఎం మాట్లాడిన మాట. నిన్ను కోసుకుతినేంత పిచ్చోడు ఎవడూ లేరు. నీ తలమాసిన విధానాలతోని నీవే ఈ రాష్ట్రాన్ని కాల్చుకు తింటున్నవ్. రాచిరంపాన పెడుతున్నావ్. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంట్ మంచిగా ఉండే ఇప్పుడు ఎందుకు లేదు అని ప్రజలు ప్రశ్నించుకుంటున్నారు. రైతుబంధు సమయానికి పడుతుండే అని అనుకుంటున్నారు. ఆసరా పెన్షన్లు ఎందుకు ఎగ్గొడుతుండు అని ప్రజలు చర్చించుకుంటున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు రాష్ట్రం పురోగమనంలో ఉంటే ఇప్పుడు ఎందుకు తిరోగమనంలో ఉంది అని ప్రశ్నించుకుంటున్నారు. ఇది నాయకత్వం లోపం కాదా..? ఇది మీ కాంగ్రెస్ తెలంగాణకు పెట్టిన శాపం. మార్పు పేరుతో చేసిన దుర్మార్గం ఇది. పరిపాలిస్తున్న రాష్ట్రానికి శాపనార్థాలు పెట్టిన సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు. ఎయిడ్స్ పేషెంట్ అంటివి. క్యాన్సర్ పేషెంట్ అంటివి.. ఆఖరికి నిన్న దివాళా తీసింది అని అంటివి. రాష్ట్రం పాలిట నీ మాటలు శాపంగా మారాయన్నారు.

ఏ రాష్ట్రానికైనా ప్రభుత్వానికైనా అప్పులు, ఆస్తులు వారసత్వంగా వస్తాయి. కాంగ్రెసోళ్లు మాకు అప్పజెప్పినప్పుడు అప్పులు, ఆస్తులు ఇచ్చారు. 2014 లెక్కలు తీసుకుంటే.. రాష్ట్ర ఆదాయం 51 వేల కోట్లు. మేం దిగిపోయిన నాడు ఆదాయం 2 లక్షల 16 వేల 567 కోట్లు. మరి రాష్ట్ర ఆదాయం పెరగలేదా..? 2014-15లో రెవెన్యూ మిగులు 369 కోట్లు.. మేం దిగిపోయిన నాడు 4882 కోట్లు. ఇది కాగ్ లెక్క. కానీ ఇష్టమొచ్చిన లెక్కలు చెబుతున్నడు రేవంత్ రెడ్డి. శ్వేతపత్రం అనే అబద్దాల జాతర మొదలు పెట్టారు. అధికారంలోకి వచ్చిన రెండు వారాలకే 6 లక్షల కోట్ల అప్పు అని చెప్పారు. నిన్న చెబుతున్నాడు.. 8 లక్షల 29 వేల కోట్లు అని. ఈ సంఖ్య రోజురోజుకు మారుతుంది. సర్కార్ నడుపుతున్నారా.. సర్కస్ నడుపుతున్నారా..? అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.పదేండ్ల కాలంలో 4 లక్షల 17 వేల కోట్ల మాత్రమే చేశాం. ఏడాదికి 40 వేల కోట్లు మాత్రమే. రాష్ట్ర ప్రభుత్వం మాత్రమే చెల్లించె అప్పు లక్షా 15 వేల 599 కోట్లు. 4 వేల కోట్ల నెలసరి ఆదాయంతో మాకు అప్పజెపితే.. తిరిగి మేం 2023 డిసెంబర్‌లో 18 వేల కోట్లతో అప్పజెప్పాం.. నిన్న 2025 మే నెలలో ఏం మాట్లాడుతున్నారు. 18 వేల కోట్లే వస్తుందని అంటున్నరు. మరి ఈ 17 నెలల కాలంలో నువ్వు ఏం చేస్తున్నవ్.. నీ ప్రభుత్వం ఏం జేస్తుంది. ఎందుకు ఆదాయం పెంచలేకపోయారు. కేసీఆర్ అప్పజెప్పిన 18 వేల కోట్లు తప్ప నీ ప్రభుత్వం రూపాయి అయినా ఆదాయం పెంచగలిగిందా..? అని ప్రశ్నించారు.

## మినీ అంగన్వాడీ టీచర్లు ప్రమోట్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

మినీ అంగన్‌వాడీ టీచర్లకు శుభవార్త తెలిపింది. 3,989 మంది మినీ అంగన్‌వాడీ టీచర్ల ను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోట్ చేస్తూ జీవో నెంబర్ 306ని జారీ చేసింది. ఇక నుంచి మినీ, మెయిన్ అంగన్‌వాడీ అన్న తేడా లేకుండా అందరూ అంగన్‌వాడీ టీచర్లేనని స్పష్టం చేసింది. ఈ నెల నుంచే అది అమల్లోకి రానున్నది. ఇప్పటివరకూ మినీ అంగన్‌వాడీలకు రూ.7800 ఇస్తున్నది. ఇక నుంచి వారికి నెలకు రూ.13,650 ఇవ్వనుంది. సాంకేతిక సమస్యలు, న్యాయపరమైన చిక్కుల వల్ల ఇంతకాలం ఆలస్యమైనట్టు ప్రభుత్వం పేర్కొంది. తమను మెయిన్ అంగన్‌వాడీ టీచర్లుగా ప్రమోట్ చేయడంపై మినీ అంగన్ వాడీ టీచర్లు హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభు త్వానికి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## సరస్వతీ పుష్కరాలకు సీఎంకు ఆహ్వానం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

సరస్వతి పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రులు మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీనియర్ అధికారులతో కలిసి జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు. రహదారులు, భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లకు కూడా మంత్రులు పుష్కరాల ఆహ్వాన పత్రికను అందించారు. ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు 12 రోజుల పాటు జరిగే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులకు

## హైదరాబాద్‌లో నేడు సెక్యూరిటీ మాక్ డ్రిల్స్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. శత్రువుల నుంచి దాడులు ఎదురైన పక్షంలో పౌరులు సమర్థవంతంగా ఆత్మరక్షణ చేసుకునేందుకు పాటించాల్సిన అంశాలపై బుధవారం సెక్యూరిటీ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించింది. కేంద్రం ఆదేశాలతో తెలుగు రాష్ట్రాలతోపాటు బుధవారం మొత్తం 259 చోట్ల మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. ఇక హైదరాబాద్ లో మొత్తం నాలుగు ప్రాంతాల్లో ఈ డ్రిల్స్ జరగనున్నాయి. కంచన్‌బాగ్ డీఆర్డీవో, మౌలాలి ఎన్ఎఫ్‌సీ, సికింద్రాబాద్, గోల్కొండలో సాయంత్రం 4 గంటలకు సెక్యూరిటీ మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

కాగా, మాక్‌డ్రిల్స్‌పై కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ ఆధ్వర్యంలో కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దాడులకు అవకాశం ఉన్న జిల్లాలను మూడు కేటగిరీలుగా విభజించారు. ప్రధాని నివాసం, త్రివిధ దళాల హెడ్ క్వార్టర్స్ ఉండడంతో కేటగిరి 1లో దేశ రాజధాని ఢిల్లీ, తారాపూర్ అణు కేంద్రం ఉన్నాయి. కేటగిరి 2లో తెలుగు రాష్ట్రాల్లోని విశాఖపట్నం, హైదరాబాద్‌లు ఉన్నాయి. రేపు మొత్తం 259 చోట్ల మాక్ డ్రిల్స్ నిర్వహించనున్నారు. కశ్మీర్, గుజరాత్, హిర్యాణా, అస్సాం, రాజస్థాన్, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో అత్యధిక చోట్ల డ్రిల్స్‌కు ఏర్పాట్లు చేశారు. మెట్రోలు, రక్షణ సంస్థలు, కీలక ప్రాజెక్టుల రక్షణ పైన మాక్ డ్రిల్ జరగనుంది. ఈ మాక్ డ్రిల్స్‌లో అధికారులతో పాటు సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోంగార్డులు, ఎన్‌సీసీ/ ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువకేంద్రాలు, కళాశాలలు/ పాఠశాలల విద్యార్థులను భాగస్వాముల్ని చేయనున్నారు. శత్రుదాడి జరిగినప్పుడు స్వీయరక్షణతో పాటు విద్యార్థులు, యువకులు ఎలా ప్రతిస్పందించాలో అవగాహన కల్పించాలని హోంశాఖ తెలిపింది.

# ప్రభుత్వానికి రైతుల కన్నీళ్లు కనబడతలేవా..

- వడ్ల కొనడానికి ఎందుకింత జాప్యం చేస్తుండ్రు..
- సంవిధాన్ చేత పట్టి రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలు ఏమయ్యాయి..
- ప్రజల దృష్టిని మళ్లించడానికి కాంగ్రెస్ నాయకులు డ్రామాలాడుతుండ్రు..
- రేపటి నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తాం..
- సంజయ్ సారూ.... అప్పు పుడతలేదు...పిల్లనిస్తలేరు...
- కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్





**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజా సమస్యలను ప్రస్తావిస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడుగుతుంటే "నాతో ఏమీ కాదు... నా దగ్గర పైసల్లేవ్" అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేతులెత్తేస్తున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ కమార్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పర్యటించారు. ముందుగా ఎల్లారెడ్డిపేట మండలంలోని ప్రెస్ క్లబ్ ను సందర్శించారు. బండ లింగంపల్లి గ్రామంలో బద్ది పోచమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజ చేశారు.గంబీరావుపేట మండలం నర్మాల గ్రామంలోని శ్రీ శివలింగసహిత మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం సంజయ్ కుమార్ పాల్గొన్నారు. అంతకు ముందు గంభీరావుపేట మండల కేంద్రంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి



బండి సంజయ్ కుమార్ సందర్శించారు.. రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు సంజయ్ ను కలిసి తమ బాధలు చెప్పుకుంటూ వాపోయారు. సంజయ్ సారూ....మా బాధలు చూడటానికి వచ్చినారా, ఏమని చెప్పమంటారు మా గోస, అప్పు పుడతలేదు,రైతు అని చెబితే పిల్లనిస్తలేరని ఆవేదన వ్యక్తం చేశారు.32 క్వింటాలు రావాల్సిన పంట ఈసారి 20 క్వింటాలలోపే దిగుబడి వచ్చింది. అవైనా అమ్ముకుందామని ఈడకొస్తే కొనే దిక్కేలేదు, వాననోగాలో వస్తే భయమైతది. వడ్లపై కప్పుదామంటే నిన్నటిదాకా టార్పాలిన్ కూడా ఇయ్య లేదు,క్వింటాలుకు 5 కిలోలు కోత పెడుతున్నారు. ఇగ మమ్ముల్ని ఆదుకునేది ఎవరు అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎదుట రైతులు తన గోడును వెల్లబోసుకున్నారు.

ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ఖేల్ ఖతం... దుకాణం బంద్ అయినట్లేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రమనే కుటుంబానికి పెద్దగా ఉండాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాతో ఏం కాదు అని,ఏమీ చేయలేని స్థితిలో ఉన్నా అని,రాష్ట్రం దివాళా తీసిందని,అని మాట్లాడటం సిగ్గు చేటు అని అన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నరని, సీఎం మాటలతో కాంగ్రెస్ ఖేల్ ఖతం దుకాణ్ బంద్ అయిందని అన్నారు.సీఎం వ్యాఖ్యలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా మా భవిష్యత్తు ఏమిటనే భయంతో ఉన్నరని, రాష్ట్రానికి పెద్దగా ఉన్న ముఖ్యమంత్రి రాష్ట్రం పరువు తీసిందు అని,దేశం ముందు తలదించుకునేలా చేసిండని,యావత్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని సీఎం పూర్తిగా మంట కలిపారుని,4 కోట్ల తెలంగాణ ప్రజలకు ఇంతకంటే అవమానం మరొకటి లేనేలేదని అన్నారు.

ఢిల్లీకి పోతే ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు అపాయిట్ మెంట్ కూడా ఇస్తలేరని, చెప్పడం పచ్చి అబద్ధం. ప్రధానమంత్రిని చాలా సార్లు కలిశారని,కేంద్ర మంత్రులను ఎప్పుడంటే అప్పుడు కలుస్తూనే ఉన్నడని, కేంద్ర మంత్రులు అపాయిట్ మెంట్ ఇయ్యడం లేదని,చెప్పులు ఎత్తకపోయేవాడిలా చూస్తున్నారని అనడం సిగ్గుచేటు అని అన్నారు.హామీలను అమలు చేయలేం,ఉద్యోగుల సమస్యలను పరిష్కరించలేం,ఇచ్చిన హామీలను ఆ అమలు చేయడం లేదని చెప్పిండని అన్నారు. అమలు చేయలేమని చెప్పిండు..ఎన్నికలకు ముందు ఇదే రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పిండని,అయినా వంద రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేస్తానని హామీ అమలు చేయడం లేదు అని అన్నారు. మాట తప్పిన కాంగ్రెస్ ను వదిలిపెట్టే ప్రసక్తే లేదని అన్నారు. సంవిధాన్ పుస్తకం చేత పట్టుకుని రాహుల్ గాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఎందుకు చేతులెత్తేశారో సమాధానం చెప్పి తీరాల్సిందే అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేసేదాకా కాంగ్రెస్ ను వదిలిపెట్టబోమని,రేపటి నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను నిలదీస్తాం. ప్రజలతో కలిసి అడ్డుకుని తీరుతామని అన్నారు.

ఏమైనా మాట్లాడితే కేంద్రం ఏమీ చేయలేదంటరని, ఇచ్చేదంతా కేంద్రమే అని అన్నారు.తెలంగాణ ప్రజలపై మోదీ ప్రభుత్వానికి ఉన్న అభిమానంతో రాజీవ్ రహదారిని 6 లేన్ జాతీయ రహదారిగా మార్చేందుకు కేంద్రం సిద్ధమైందని అన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్రం పూర్తిస్థాయిలో సహకరించేందుకు సిద్ధంగా ఉందని, ఇప్పటికే 10 ఏళ్లలో 12 లక్షల కోట్లు ఖర్చు చేసామని, రాబోయే 2 ఏళ్లలో రోడ్లు, మౌలిక సదుపాయాల కోసమే మరో 2 లక్షల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమని, కలిసి పనిచేసేందుకు మేమెప్పుడూ సిద్ధమే అని అన్నారు.ఇకనైనా కేంద్రంపై బురద చల్లడం మానుకొని ప్రజల బాధలను అర్ధం చేసుకుని సమస్యను పరిష్కరించే దిశగా కాంగ్రెస్ నేతలు దృష్టి పెట్టాలని అన్నారు.

వడ్ల కొనుగోలు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నదని, వడ్ల పైసలన్ని కేంద్రమే చెల్లిస్తోందని, అయినా వడ్ల కొనుగోలును త్వరగా పూర్తి చేయకుండా జాప్యం చేయడం ఏమిటి అని ప్రశ్నించారు.కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 500లకుపైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 45 రోజులు దాటినా ఇంతవరకు పూర్తిస్థాయిలో వడ్లను ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ రెండు జిల్లాల్లో 7 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను కొనాల్సి ఉండగా ఇప్పటి వరకు సగం కూడా కొనలేదన్నారు. వడ్లను కొన్న తరువాత నెలరోజులైనా రైతుల ఖాతాల్లో పైసలు జమ చేయడం లేదని, ఇట్లయితే రైతులు బతికేదెలా? అని ప్రశ్నించారు. వడ్ల కొనుగోలులోనూ రాజకీయం జోక్యం ఎక్కువైందని,ప్రశ్నించిన వాళ్లపై కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. అయినా వడ్ల కొనుగోలు పైసలన్నీ మిత్తీతోసహా కేంద్రమే చెల్లిస్తోందని, 10 ఏళ్లలో వడ్ల కొనుగోలు కోసమే లక్షన్నర కోట్ల రూపాయలు చెల్లించిందని, అయినా మీకు వచ్చిన ఇబ్బంది ఏంది,రైతులను ఎందుకు అరిగోస పెడుతున్నారు అని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన వడ్లను కొనుగోలు చేయాలని, వెంట వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అట్లాగే అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, తడిసిన వడ్లతోసహా ప్రతి గింజను కొనుగోలు చేసి రైతులకు ఉపశమనం కలిగించాలని కోరారు.

## పవర్లూమ్ కార్మికులకు సరైన పనికి సరైన వేతనం ఇవ్వాలి..

**-పాలిస్టర్ వస్త్ర వ్యాపార సంఘం వద్ద ధర్నా విజయవంతం చేయండి.**

**- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ముశం రమేష్**

**బలగం టీవీ, సిరిసిల్ల**



ప్రభుత్వం ఉత్పత్తి చేస్తున్న మహిళా సంఘాల చీరలకు కార్మికులకు మెరుగైన వేతనం ఇవ్వాలని,ప్రభుత్వం మీటరుకు రెండు రూపాయలు యజమానులకు పెంచిన కూడా సరియైన వేతనం ఇవ్వకుండా తగ్గించాలని చూస్తున్నా యజమానులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ముశం రమేష్ డిమాండ్ చేశారు.మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని అమృత శుక్ల కార్మిక భవనంలో వార్పిన్ కార్మికుల జనరల్ సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమానికి సి ఐ టీ యు రాష్ట్ర అధ్యక్షుడు ముశం రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ యజమానుల వైఖరి నిరసిస్తూ పాలిస్టర్ వస్త్ర వ్యాపార సంఘం వద్ద బుధవారంధర్నా నిర్వహించడం జరుగుతుందని,వార్పిన్. వై పని పవర్లూమ్ కార్మికులు పాల్గొని ధర్నాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.పవర్లూమ్, వార్పిన్, వై పని కార్మికులు 15 రోజుల క్రితం మహిళా సంఘాల చీరలకు కూలి పెంచాలని సమ్మె చేసిన సందర్భంగా చేనేత జోలి శాఖ అధికారులు గత బతుకమ్మ చీరలకు ఏ విధంగా అయితే కూలి వచ్చిందో అంతకంటే మెరుగైన వేతనం కార్మికులకు అందించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం తో సమ్మె విరమించడం జరిగిందని అన్నారు. వారు హామీ ఇచ్చిన ప్రకారంగా కార్మికుల కూలి పెంచడం కోసం మీటరుకు రెండు రూపాయలు బట్ట ధర పెంచడం జరిగిందని, కార్మికుల కోసం రెండు రూపాయలు ప్రభుత్వం ఇచ్చిన కూడా కార్మికుల శ్రమకు తగ్గ వేతనం ఇచ్చేందుకు యజమానులు మనసు రావడం లేదని అన్నారు.

కార్మికులు ప్రభుత్వం నుంచి పోరాడి సాధించినటువంటి కూలీ నుండి కూడా. యజమానులు లాభం పొందాలని చూస్తున్నారనిఅన్నారు.బతుకమ్మ చీరల కూలి ఇంతకుముందు పవర్ లోన్ కార్మికులకు 5.25 పైసలు కూలి ఉంటే, ఇప్పుడు ఐదు రూపాయలు ఇస్తామని అంటున్నారని అన్నారు .వార్పిన్. వై పని కార్మికునికి గత బతుకమ్మ చీరలపనికంటే,విపరీతమైన పని భారం పెరిగిందని, చిన్నకోములు వస్తున్నాయని,పోగులు పెరిగినాయని, అయినా కూడా పెరిగిన పనికి ధర ఇవ్వడానికి, యజమానులు ఒప్పుకోవడం లేదని అన్నారు. చేనేత జౌళి శాఖ అధికారులు కూలి నిర్ణయం చేయకపోవడం,యజమానులకు కూలి నిర్ణయించాలని బాధ్యతలు అప్పజెప్పడం వలన ఈ పరిస్థితి రావడం జరిగిందనిఅన్నారు. అధికారుల యజమానుల మధ్య.కార్మికులునష్టపోవడం జరుగుతుందని, అధికారులు వెంటనే జోక్యం చేసుకొని కూలి సమస్య పరిష్కరించాలి లేని ఎడల పోరాటాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. అనంతరం సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు.సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కో డం రమణ, అధ్యక్షులు సిరిమల్ల సత్యం,ఉడుత రవి,మచ్చ వేణు, బుట్ల వెంకటేశం, దోమల రమేష్, ఐరన్ ప్రవీణ్, సామల శీను తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగులు అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి వ్యతిరేకం కాదు..

**- టీపీటీఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి**

**బలగం టీవీ, సిరిసిల్ల**




ముఖ్యమంత్రి రేవత్ రెడ్డి రాష్ట్ర ఆత్మగౌరవాన్ని కించపరిచేలా, తెలంగాణ ప్రజలను ఢిల్లీలో దొంగలుగా చూస్తున్నారని, ఉద్యోగులు ప్రజల అభివృద్ధిని అడ్డుకుంటున్నారనే విధంగా వాఖ్యలు చేయడాన్ని టీపీటీఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నదని టీపిటీఎఫ్ జిల్లా అధ్యక్షులు దుమాల రమానాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన జిల్లా కమిటీ సమావేశంలో దుమాల రమానాథ్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు తెలంగాణ అభివృద్ధికి, సంక్షేమానికి వ్యతిరేకం కాదని, ప్రజలు పాలకులకు అధికారాన్ని అప్పగించిందని, ప్రజలందరీ బాగోగుల కోసమే అని అన్నారు. ఉద్యోగులు కూడా ప్రజలలో భాగమేననే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలని అన్నారు. ఉద్యోగులు జి.పి.ఎఫ్, టిఎస్జిఎల్ఐ లలో తాము దాచిపెట్టుకున్న సొమ్మును ప్రభుత్వం తిరిగి ఇవ్వకుండా సంవత్సరాలుగా పెండింగ్ లో ఉంచడం సరికాదు అని అన్నారు.30 ఏళ్ళకు పైగా ప్రభుత్వ ఉద్యోగిగా ప్రభుత్వానికి సేవలు అందించి రిటైర్డ్ అయిన పెన్షనరీ ప్రయోజనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తే, ప్రభుత్వం ఉద్యోగులు బోనస్ ఇవ్వాలని ఉద్యమాలు చేస్తున్నారని ప్రజలను, సమాజాన్ని తప్పుదోవ పట్టించే విధంగా ముఖ్యమంత్రి అసత్యాలను మాట్లాడడం శోచనీయం అని అన్నారు.ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన హామీలనే డిమాండ్లుగా చేసుకొని నేడు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తున్నవి అని అన్నారు. ప్రభుత్వం గత పదిహేను నెలలుగా అనేక మార్లు ఉద్యోగ జెఎసి తో చర్చలు జరిపి పరిష్కరిస్తామని చెప్పి నేడు ఉద్యోగులకు మొండి చెయి చూపెడుతూ వంచిస్తున్నదని అన్నారు. ఉద్యోగ జెఎసి ప్రభుత్వం ముందు పెట్టిన 57 డిమాండ్లలో సుమారు 40 డిమాండ్లు ఆర్థికేతరమైనవే అని అన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వేసిన మంత్రుల ఉప కమిటీ అనేది పేరుకే మిగిలిపోయిందని, రాష్ట్రం ఆర్థికంగా దివాళ తీయడానికి ప్రభుత్వ పాలకులే బాధ్యత వహించాలని అన్నారు. పాలకులు అడ్వర్టైజ్మెంట్ల పేర్ల మీద, హెలికాప్టర్ల ప్రయాణాల మీద పెడుతున్న అడ్డగోలు ఖర్చులను తగ్గించి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచకుండా సామాన్య, మధ్యతరగతి ఉద్యోగుల హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. ఉద్యోగులను బెధిరించి, ప్రజలకు ఉద్యోగులకు మధ్య చిచ్చుపెట్టి బాధ్యతల నుండి తప్పించుకొనే ప్రయత్నంలో భాగంగానే ముఖ్యమంత్రి ఉద్యోగులపై అసంబద్ధ వాఖ్యలు చేశారని, ఉద్యోగులుగా న్యాయపరంగా రావాల్సిన హక్కుల కోసం నిరంతరం పోరాడుతాము అని అన్నారు. టీపీటీఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శి విక్కుర్తి అంజయ్య, రాష్ట్ర కౌన్సిలర్ సత్తు రవీందర్, జిల్లా ఉపాధ్యక్షులు హన్మండ్లు దబ్బెడ, మందాడి శ్రీనివాసరెడ్డి, నూగురి దేవేందర్, జిల్లా కార్యదర్శిలు మైలారం తిరుపతి, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు బొజ్జ కృష్ణ , వేములవాడ రూరల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి దూస సంతోష్, తంగళ్ళపల్లి మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్,జిల్లా కౌన్సిలర్ చకినాల భాస్కర్లు పాల్గొన్నారు.

# వేములవాడలో భూసేకరణ పనులు వేగంగా చేయాలి

● కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ పట్టణంలోని మూలవాగు నుంచి శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం వరకు రోడ్డు విస్తరణ కోసం భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు విస్తరణ, భూ సేకరణ పనులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ వేములవాడ పట్టణంలో 80 ఫీట్ల రోడ్డుకు మార్కింగ్ చేయడంతో పాటు, 350 కుటుంబాలకు నష్టపరిహారం కింద గజానికి 30 వేల రూపాయలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదనిఅన్నారు. వేములవాడ పట్టణంలో 50 ఏండ్లుగా రోడ్ల విస్తరణ పనులకు ఆటంకాలు ఎదురవుతున్నాయని, ఈసారి కచ్చితంగా 80 ఫీట్ల రోడ్డు విస్తరణ పనులు కొనసాగిస్తామని అన్నారు. నష్టపరిహారం కింద 47 కోట్ల 80 లక్షల రూపాయలు కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని, నిర్వాసితులందరికీ ప్రభుత్వం నష్ట పరిహారం అందజేస్తుందని అన్నారు.

వేములవాడ ఆలయం వద్ద రోడ్డు విస్తరణ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, వీటికి అవసరమైన భూసేకరణ చేసేందుకు తొలగించాల్సిన సర్వే చేసి త్వరగా అందించాలనిఅన్నారు. విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. 315 ఇండ్ల నిర్మాణాల ప్రతిపాదనలను 4 టీం ల ఇంజనీరింగ్ అధికారుల ద్వారా ఇప్పటి వరకు 257 ఇండ్లకు సంబంధించిన సర్వే పూర్తి చేసినట్లు, మిగిలినవి వీలైనంత త్వరగా అందిస్తామని అధికారులు తెలిపారు. భూ సేకరణ చట్టం 2013 సెక్షన్ 12 ప్రకారం భూసేకరణ నిమిత్తం సర్వే చేసే పూర్తి అధికారాలు తమకు ఉన్నాయనిఅన్నారు. చట్టంపై అధికారులు అవగాహన పెంచుకొని వారంలో మొత్తం భూ సేకరణ సర్వే పొరపాట్లు జరగకుండా పూర్తి చేసి ప్రతిపాదనలు అందిస్తే వెంటనే అవార్డులు అందజేస్తామని అన్నారు.కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాధాబాయి, మున్సిపల్, ఆర్ అండ్ బి, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు - అన్నదాతలకు అవగాహన

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం.ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధన ఫలితాలను క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయ విజ్ఞానాన్ని అందించాలనే సదుద్దేశంతో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు ఈ నెల ఐదో తేదీ నుండి జూన్ నెల 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా నేడు మే 6వ తేదీన రైతు వేధిక విలాసాగర్ గ్రామంలో నిర్వహించడం జరిగినది.

డా.అరుణ్ బాబు మాట్లాడుతూ: సాగునీటిని ఆదా చేయడంపై వరిలో తడి పొడి విధానంతో నాటి యాజమాన్యం చేసినట్లయితే 15-30%నీటిని ఆదా చేయొచ్చని, మొక్కజొన్నలో జంట సాళ్ళ పద్ధతిలో డ్రిప్ ద్వారా సాగు చేయాలని, బిందు (డ్రిప్) మరియు తుంపర్ల సేద్యం ద్వారా మొక్కలకు నీటిని అందిస్తే నీటి వినియోగ సామర్థ్యం 85-90% పెంచవచ్చని, చేనులో వాలు ఉన్న వైపు నీటి కుంటల నిర్మాణం ద్వారా, మల్చింగ్ మొదలగు పద్ధతులు ద్వారా నీటిని ఆదా చేయవచ్చని తెలిపారు. పంట మార్పిడి చేసి విభిన్న మార్కెట్ అవకాశాలు పొందడం, ఆహార భద్రత పెంపొందించడం, తెగుళ్ల తీవ్రత తగ్గించడం, వానాకాలం, యాసంగి కాలాల్లో వేర్వేరు పంటలు సాగు చేయడం, మిశ్రమ పంటలు పండించడం మొదలగునవి పాటించాలని రైతులకు సూచించారు.



డా.మాధవి మాట్లాడుతూ: రసాయన ఎరువులను, పురుగు మందులను సిఫారసు చేసిన మోతాదులో మాత్రమే వాడాలని, జీవ నియంత్రణ పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు అనుసరించాలని, మట్టి నమూనా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ నిమిత్తం కొనుగోలు చేసిన విత్తనాలు, రసాయన ఎరువులు, మందులకి సంబంధించిన రశీదులు భద్రపరచుకోవాలని సూచించారు. హెచ్. ఓ లోకేష్ మాట్లాడుతూ: పంట మార్పిడిలో భాగంగా ఆయిల్ పామ్ పంట సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందని, రైతులు సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. ఏ.డి.ఏ రామారావు మాట్లాడుతూ: తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించుకోవాలని,అవసరం మేర రసాయనాలను వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని, చెట్లని పెంచి పర్యావరణాన్ని కాపాడాలని రైతులను కోరారు. ఈ కార్యక్రమానికి బాబు జగజ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, జిల్లెళ్ల నుండి డా.అరుణ్ బాబు, డా.మాధవి, వేములవాడ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రామారావు, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్,మండల వ్యవసాయ అధికారిని కె.ప్రణీత,ఉద్యానవన అధికారి లోకేష్,వ్యవసాయ విస్తీర్ణ అధికారి రజిత, రైతులు పాల్గొన్నారు.

# గంజాయి నిందుతుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు..




**-ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

15గంజాయి కేసులలో నిందుతునిగా ఉండి, 5 కేసులల్లో పరారీలో ఉన్న హమ్మద్ ను అరెస్ట్ చేసి, రిమాండ్ కి తరలించినట్లు ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.మంగళవారం సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా కేసులో సిరిసిల్ల పట్టణంకి చెందిన ఎండీ. హమ్మద్ పై ఎల్లారెడ్డిపేట, తంగాలపల్లి, బోయినపల్లి,చందుర్తి పోలీస్ స్టేషన్ లలో 15 కేసులు నమోదు కాగా, సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్లో 04,చందుర్తి పోలీస్ స్టేషన్లో 01కేసులో పరారీలో ఉన్నాడని అన్నారు.హమ్మద్ సిరిసిల్లకి వస్తున్నాడన్న సమాచారం మేరకు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని ఎల్లమ్మ చౌరస్తా వద్ద హమ్మద్ ను అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందని అన్నారు.

జిల్లాలో గంజాయి అక్రమ రవాణాపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసి గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ లు చేపడుతూ గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపడం జరుగుతుదన్నారు.గంజాయి రహిత జిల్లాగా మార్చడాని జిల్లా పోలీస్ విన్నూత కార్యక్రమలు చేపడుతూ ప్రజల్లో అవగాహన కల్పించడం జరుగుతుందని,గంజాయి నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు.

జిల్లాలో గంజాయి విక్రయించిన,సాగు చేసిన, రవాణా చేసిన సేవించిన వారి సమాచారం %క్ష్మూ-చీూదీ% 8712656392 నంబర్ కి అందించలని,సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుదని అన్నారు.ఇక్కడ సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, క్రైమ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, కానిస్టేబుల్ ఇంతియాజ్ ఉన్నారు.



# రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగించుకోవాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, వేములవాడ**

భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు ఇచ్చారు.భూ భారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులలో భాగంగా రుద్రంగి, మానాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని,ఇప్పటికే అన్ని మండలాల్లో నూతన చట్టం గురించి అవగాహన కల్పించామని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రుద్రంగి మండలాన్ని పైలెట్ ప్రాతిపదికన ఎంపిక చేసి గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో భూ రికార్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వారసత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. వివిధ కారణాల వల్ల రెవెన్యూ సదస్సులో అర్జీలు సమర్పించే అవకాశం లభించని వారు తరువాత కూడా దరఖాస్తు చేసుకోవచ్చని, అధికారులు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని,ధరణి పోర్టల్ ద్వారా ఆన్లైన్లో కూడా అప్లై చేసుకోవచ్చని అన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దరఖాస్తులను అందజేయడం జరుగుతుందనిఅన్నారు. భూ సమస్యలను పరిష్కరించుకుని, భూ వివాదాలు లేని గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దుకోవాలనిఅన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను మండలంలోని అన్ని గ్రామాల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పైలెట్ మండలంలోని ఆయా రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 15 వ తేదీ వరకు సదస్సులు పూర్తయ్యాక, జిల్లాలోని మిగతా అన్ని మండలాలలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తామని అన్నారు. ఈ సందర్భంగా అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు.దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. సదస్సులో రెవిన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు వేగంగా చేయాలి

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని బాలానగర్ లోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి మానాలలోని కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీఓ శేషాద్రి తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే తరలించాలని, కొనుగోళ్లలో వేగం పెంచాలని ఆదేశించారు.

# బీజేపీ జెండా ఆవిష్కరణ

**-వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర నాయకులు వికాస్**

**బలగం టీవీ, వేములవాడ**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం గుర్రంవానిపల్లి గ్రామంలో మండల అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి, రాష్ట్ర నాయకులు డా.చెన్నమనేని వికాస్ బీజేపీ జెండాను మంగళవారం ఆవిష్కరించినారు. అనంతరం గ్రామంలో బీజేపీ పార్టీలో పలువురు చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించినారు. డాక్టర్ వికాస్ మాట్లాడుతూ ప్రజలందరూ బిజెపి వైపు చూస్తున్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చిన తెలంగాణలో బిజెపి విజయం సాధిస్తుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతపల్లి వెంకటేశ్వర రావు, రాకేష్, సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి, ప్రశాంత్, నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు జింక శ్రీనివాస్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు సంతోష్ యాదవ్, నాయకులు జింక అనిల్, గుండెకర్ల లక్ష్మణ్, చొక్కాల మధు, చెర్ల దేవరాజు, ఆంజన్న యాదవ్, ముదం శ్రీనివాస్, గణేష్, పేరంగాని మల్లేశం, బొల్లు తిరుపతి, మాజీ ఉప సర్పంచ్ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌తో క్రికెట్ వద్దు..



**భారత జట్టు కోచ్ గౌతం గంభీర్**

**బలగం టీవీ, హైదరాబాద్**

పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు వద్దే వద్దని భారత జట్టు కోచ్ గౌతం గంభీర్ స్పష్టం చేశాడు. 'పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్‌లు ఆడాలా? వద్దా? అనే ప్రశ్నకు నేను వద్దనే చెబుతాను. ఉగ్రదాడులు ఆగేంతవరకూ దాయాదితో క్రికెట్ సహా ఏ ఆట కూడా ఆడే ప్రసక్తే లేదు. అయితే.. పాక్‌తో క్రికెట్ ఆడడంపై తుది నిర్ణయం ప్రభుత్వానిదే. భారతసైనికుల ప్రాణాలు, ప్రజల భద్రత కంటే పాక్‌తో క్రికెట్ మ్యాచ్‌లు, బాలీవుడ్, ఇతర సంబంధాలు కూడా ముఖ్యం కాదని నేను ఇదివరకూ చెప్పాను' అని గౌతీ వివరించాడు. అంతేకాదు కోచ్‌గా తన పని ఆటగాళ్లను సెలెక్ట్ చేయడం కాదని గంభీర్ చెప్పాడు. జూన్‌లో ఇంగ్లండ్ సిరీస్ ఉన్నందున ఎవరిని ఎంపిక చేయాలనేది తన జాబ్ కాదని సెలవిచ్చాడు.

'కోచ్‌గా నా బాధ్యత ఆటగాళ్లను దారిలో పెట్టి జట్టును విజయపథాన నడిపించడమే. అంతేతప్ప ఆటగాళ్లను, టీమ్‌ను సెలక్ట్ చేయడం కాదు. ఆటగాళ్ల ఎంపిక అనేది పూర్తిగా సెలెక్టర్ల బాధ్యత. అందులో నా ప్రమేయం ఉండదు. వాళ్లు ఎంపిక చేసిన స్క్వాడ్‌లో మ్యాచ్‌కు అవసరమైన 11 మందిని తీసుకొని.. కోచింగ్ ఇస్తానంతే' అని గంభీర్ తెలిపాడు.

# థ్రిల్లర్‌లో గుజరాత్ టైటాన్స్ గెలుపు



- **3 వికెట్ల తేడాతో విజయం**
- **ముంబై ఇండియన్స్ విజయాలకు బ్రేక్**

**బలగం టీవీ, హైదరాబాద్**

థ్రిల్లర్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్‌పై 3 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్ విజయం సాధించింది మంగళవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌కు వర్షం తీవ్ర అంతరాయం కలిగించింది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 155 పరుగులు చేశారు. దీనితో 156 పరుగుల లక్ష్యంతో దిగిన గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు మొదట్లో పరుగులు రాబట్టడంలో చాలా ఇబ్బందిపడ్డారు. కానీ శుభ్‌మన్ గిల్? (43), బట్లర్ (30) నిలకడగా ఆడారు. తరువాత ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన రూథర్ ఫోర్డ్ బౌండరీలు బాదుతూ, దూకుడుగా ఆడాడు. అయితే వర్షం కురవడం వల్ల మ్యాచ్‌కు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. మ్యాచ్ తిరిగి ప్రారంభం అయ్యాక రూథర్‌ఫోర్డ్ (28) ఎల్‌బీడబ్ల్యూగా వెనుతిరిగాడు. తరువాత షారుక్ ఖాన్ (6) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. రషీద్ ఖాన్ (2) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. అయితే 18వ ఓవర్ తరువాత మళ్లీ వర్షం మొదలైంది. దీనితో ఆటను నిలిపివేశారు. ఆ సమయంలో గుజరాత్ టైటాన్స్ 12 బాల్స్‌లో 24 రన్స్ చేయాల్సి ఉంది. అయితే డక్‌వర్త్ లూయిస్ ప్రకారం, గుజరాత్ టైటాన్స్ 5 పరుగుల వెనుకంజలో ఉంది. మ్యాచ్ ఆగిపోయి ఉంటే ముంబై గెలిచి ఉండేది. అయితే చివరి నిమిషాల్లో వర్షం ఆగడంతో ఆటను 19 ఓవర్లకు కుదిస్తూ గుజరాత్ టైటాన్స్ డక్ వర్త్ లూయిస్ విధానం ప్రకారం 6 బంతుల్లో 15 పరుగులు చేయాల్సిందిగా నిర్ణయించారు అంపైర్లు.

దీపక్ చాహర్ వేసిన చివరి ఓవర్‌లో మొదటి బంతికి రాహుల్ తెవాటియా ఫోర్ బాదాడు. రెండో బంతికి సింగిల్ మాత్రమే వచ్చింది. మూడో బంతికి గెరాల్డ్ కాట్జే సిక్సర్ బాదాడు. చివరి 3 బంతుల్లో గుజరాత్ విజయానికి 4 పరుగులు అవసరం అయ్యాయి. ఆ తర్వాతి బంతి నో బాల్ కాగా, సింగిల్ వచ్చింది. 3 బంతుల్లో 2 పరుగులే కావాల్సి వచ్చాయి. నాలుగో బంతికి తెవాటి యా సింగిల్ తీశాడు. ఐదో బంతికి గెరాల్ట్ అవుట్ అయ్యాడు. దీంతో స్కోర్లు సమం అయ్యాయి. చివరి బంతికి గుజరాత్ విజయానికి సింగిల్ కావాలి.. అర్షద్ ఖాన్ సింగిల్ తీయడంతో ఆఖరి బంతికి గుజరాత్ టైటాన్స్‌కి విజయం దక్కింది..

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబయి ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. విల్ జాక్స్ (53) అర్ధ శతకం కొట్టగా, సూర్య కుమార్ యాదవ్ (35) పరుగులు చేశాడు. ఓ దశలో ముంబయి వరుసగా వికెట్లు కోల్పోయింది. అయితే కోర్బిన్ బాష్ (27) పోరాటంతో స్కోర్ 150 దాటింది. గుజరాత్ బౌలర్లలో సాయి కిషోర్ 2, సిరాజ్, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ కృష్ణ, రషీద్ ఖాన్, గెరాల్డ్ కొయెట్జీ చెరో వికెట్ పడగొట్టారు.

# స్క్విడ్‌గేమ్ 3' టీజర్ రిలీజ్..

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నెట్‌ఫ్లిక్స్ సిరీస్ 'స్క్విడ్ గేమ్' మళ్లీ వచ్చేస్తుంది. ఇప్పటికే ఈ ఫ్రాంచైజ్ నుంచి రెండు సీజన్‌లు రాగా.. బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నాయి. ఫస్ట్ సీజన్ అయితే రిలీజ్ అయిన కేవలం 28 రోజుల్లో ఈ సిరీస్‌ను ప్రపంచ వ్యాప్తంగా 11 కోట్ల మంది నెట్‌ఫ్లిక్స్ యూజర్లు చూశారు. సిరీస్‌లో వయొలెన్స్ ఎక్కువ ఉన్నప్పటికీ ప్రేక్షకులకు బాగానే చేరువైంది. గతేడాది 2వ సీజన్ రాగా.. ఇది కూడా రికార్డు వ్యూస్‌ను అందుకుంది. అయితే ఇప్పటికే సక్సెస్‌ఫుల్‌గా రెండు సీజన్‌లను కంప్లీట్ చేసుకున్న ఈ వెబ్ సిరీస్ ఈ ఏడాది గ్రాండ్ ఫినాలేతో రాబోతుంది. తాజాగా 3వ సీజన్ టీజర్‌తో పాటు మేకర్స్ విడుదల తేదీని ప్రకటించారు. జూన్ 27 నుంచి ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానున్నట్లు టీమ్ తెలిపింది.






# ముగిసిన హరిహర వీరమల్లు షూటింగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చారిత్రక చిత్రం 'హరిహర వీరమల్లు' చిత్రీకరణ ఎట్టకేలకు పూర్తయింది. పలుమార్లు వాయిదాల అనంతరం, ఈ సినిమా షూటింగ్ ఈ వారం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన సెట్‌లో ముగిసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో పవన్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటించింది. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీవారణి ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్, తన రాజకీయ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ సినిమా చివరి షెడ్యూల్ కోసం రెండు రోజులు కేటాయించారు. చిత్రీకరణ పూర్తయిన నేపథ్యంలో, నిర్మాతలు త్వరలోనే సినిమా కొత్త విడుదల తేదీని ప్రకటిస్తారని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. క్రిష్ జాగర్లమూడి, ఏఎం జ్యోతి కృష్ణ దర్శకత్వంలో 'హరిహర వీరమల్లు' 17వ శతాబ్దపు మొఘల్ సామ్రాజ్య కాలం నాటి కథతో తెరకెక్కుతోంది.

ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఒక ప్రకటన విడుదల చేసింది. "పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ గారు 'హరిహర వీరమల్లు' చివరి రెండు రోజుల షూటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో ఈ భారీ సినిమా షూటింగ్ ప్రయాణం దిగ్విజయంగా ముగిసింది. మీరు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ట్రైలర్, అద్భుతమైన పాటలు త్వరలోనే మీ ముందుకు రానున్నాయి. తుపానుకు కౌంట్‌డౌన్ ఇప్పుడు మొదలైంది" అని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం 'హరి హర వీరమల్లు' పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లోకి ప్రవేశించనుంది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కావడంతో, పవన్ కళ్యాణ్ తన తదుపరి చిత్రం 'ఓజీ' పై దృష్టి సారించే అవకాశం ఉందని తెలుస్తోంది. '

# శుభవార్త చెప్పిన 'వరుణ్ తేజ్, లావణ్య'..


**బలగం టీవీ, హైదరాబాద్**



వరుణ్ తేజ్–లావణ్య త్రిపాఠి దంపతులు గుడ్ న్యూస్ చెప్పారు. తాము తల్లిదండ్రులు కాబోతున్నట్లు అధికారికంగా ప్రకటించారు. జీవితంలో అత్యంత సంతోషకరమైన బాధ్యతను తీసుకోబోతున్నామని ఇన్‌స్టాగ్రామ్‌లో రాసుకొచ్చారు. దీంతో నెటిజన్లతో పాటు మెగా అభిమానులు వారికి శుభాకాంక్షలు చెబుతున్నారు. 2023లో ప్రేమించి పెళ్లి చేసుకున్న ఈ జంట మొదటి బిడ్డను ఆహ్వానించనున్నారు. శుభవార్త చెప్పిన వరుణ్ దంపతులకు అల్లు అర్జున్ సతీమణి స్నేహ శు భాకాంక్షలు చెప్పారు. ఆపై సమంత, రకుల్ ప్రీత్‌సింగ్, రీతూ వర్మ, డింపుల్ హయాతి, సుశాంత్ వంటి సినీ స్టార్స్ కంగ్రాట్స్ అంటూ కామెంట్ బాక్స్‌లో మెసేజ్‌లు చేశారు. పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి మళ్లీ షుటింగ్స్‌లలో పాల్గొంటూ వచ్చారు. ఈ క్రమంలోనే ఒక వెబ్ సిరీస్‌ను ఆమె విడుదల చేశారు. ఆపై సతీ లీలావతితో పాటు కోలీవుడ్ మూవీ థనల్‌ను ఆమె పూర్తి చేశారు. అయితే, ఈ రెండు ప్రాజెక్ట్‌లను పూర్తి చేసిన తర్వాత ఆమె మళ్లీ కాస్త బ్రేక్ ఇచ్చారు. ఆమె ఇప్పుడు ప్రెగ్నెంట్ కావడంతో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉండాలని ఆమె నిర్ణయించుకున్నారు.

# 30న 'షష్టి పూర్తి' విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**



టాలీవుడ్ యువ దర్శకుడు పవన్ ప్రభ దర్శకత్వంలో యువ కథానాయకుడు రుపీష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'షష్టి పూర్తి' ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ పూర్తిచేసుకోగా.. చిత్రబృందం తాజాగా ఈ సినిమా విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రం మే 30వ తేదీన ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మేరకు నిర్మాణ సంస్థ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకమైన పోస్టర్‌ను విడుదల చేసింది. సీనియర్ నటులు రాజేంద్ర ప్రసాద్, అర్చన ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఒకప్పుడు 'లేడీస్ టైలర్' వంటి సూపర్ హిట్ చిత్రంలో కలిసి నటించిన ఈ జంట మళ్లీ ఈ సినిమా ద్వారా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ చిత్రానికి రామ్ రెడ్డి ఛాయాగ్రహణం అందిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ మా AAIE ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. సంగీత సామ్రాట్ ఇళయరాజా ఈ సినిమాకు తన మధురమైన సంగీతాన్ని అందిస్తున్నారు.



# పవన్‌తో డేటింగ్, ప్రభాస్‌తో మ్యారేజ్

- **ఫరియా అబ్దుల్లా**

'జాతిరత్నాలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, తన నటనతో గుర్తింపు పొందిననటి ఫరియా అబ్దుల్లా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. యాంకర్ సుమ కనకాల నిర్వహిస్తున్న ఒక ప్రముఖ చాట్ షో తాజా ఎపిసోడ్‌లో ఫరియా పాల్గొంది. ఈ సందర్భంగా, "మీకు అవకాశం వస్తే ఎవరితో డేటింగ్ చేస్తారు, ఎవరిని పెళ్లి చేసుకుంటారు?" అని సుమ ప్రశ్నించగా, ఫరియా బదులిస్తూ, "నాకు అవకాశం వస్తే పవన్ కళ్యాణ్‌తో డేటింగ్ చేస్తాను, ప్రభాస్‌ను పెళ్లి చేసుకుంటాను" అని తడుముకోకుండా సమాధానమిచ్చింది. దాంతో ఫరియా వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి.